క్లుప్తంగా

ఎమ్మెల్సీ పరామర్శ



ప్రభావతిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటకు చెందిన అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు బుధవారం పరామర్శించారు. స్థానిక 18వ వార్డుకు చెందిన కొండల ప్రభావతి ఇంట్లో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఇటీవల అగ్ని ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్సీ సురేష్‌బాబు బాధితురాలిని పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఎమ్మెల్సీ వెంట వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కో ఆప్షన్ సభ్యురాలు మాత సంధ్య, వార్డు కన్వీనర్ నల్లి శ్రీను, మద్దిల శ్రీను ఉన్నారు.

'చర్యలు తీసుకోండి'



నాగోజీ పేట అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు

విజయనగరం ఫోర్ట్: విధి నిర్వహణలో అలసత్వం వహించిన అంగన్‌వాడీ కార్యకర్తపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి. కాంతారావు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి బి.శాంతకుమారిని ఆదేశించారు. పట్టణంలోని నాగోజీపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐదు రోజులుగా చిన్నారులకు హాజరు వేయలేదు. దీంతో ఆయన అంగన్‌వాడీ కార్యకర్తను హాజరు ఎందుకు వేయలేదని ప్రశ్నించగా.. పిల్లలు రాలేదని బదులిచ్చింది. అలాంటప్పుడు ఆబ్సెంట్ ఎందుకు వేయలేదని ప్రశ్నించగా.. బదులివ్వలేదు. విధి నిర్వహణలో అలసత్వంగా ఉన్న కార్యకర్తపై చర్యలు తీసుకోవాలని ఆయన శాంతకుమారిని ఆదేశించారు.

కేవీబీ బ్రాంచ్ ప్రారంభం



బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: కరూర్ వైశ్యా బ్యాంక్ ఫోర్ట్ బ్రాంచ్‌ను కలెక్టర్ సూర్యకుమారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలను అందించడంలో బ్యాంక్‌లు ప్రజలకు మరింత చేరువకావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఎ.శ్రీనివాసరావు, కరూర్ బ్యాంక్ ఏజీఎం రమేష్, చీఫ్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, సుధాకుమారి, వినియోగదారులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

శృంగవరపుకోట: ఏపీఎస్ ఆర్టీసీ 34వ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బుధ వారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 45 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్‌తో పాటు గ్యారేజ్, ట్రాఫిక్ సిబ్బంది కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన గొల్జాం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు

లక్కవరపుకోట: కాకినాడ పి.ఆర్.డిగ్రీ కళాశాల ప్రాంగణంలో గత నెల 28వ తేదీ నుంచి 30 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-14 బేస్‌బాల్ పోటీల్లో మండలంలోని గొల్జాం ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. బాలికలు, బాలురు విభాగాలు రెండింటిలోనూ విజయనగరం జిల్లా జట్టు విజేతలగా నిలిచాయని హెచ్ఎం కె.లక్ష్మి బుధవారం తెలిపారు. జిల్లా బాలిక లు, బాలుర జట్లకు పాఠశాల నుంచి ప్రాతినిధ్యం వహించిన 9వ తరగతి విద్యార్థులు వై.హరిత, కె.గౌతం ఉత్తమ ప్రతిభ కనబరిచి జట్టు విజయాల్లో ప్రధాన పాత్ర పోషించారని హెచ్ఎం చెప్పారు. విద్యార్థులతో పాటు పీడీ ఆర్.జగదీశ్వరరావు, పీఈటీ ఎం.సురేంద్రను ఉపాధ్యాయులు అభినందించారు.

జగనన్నతోనే సంక్షేమం

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



పూసపాటిపాలెంలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, తదితరులు

పూసపాటిరేగ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయంలోనే రాష్ట్రంలో సంక్షేమం నెలకొందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పూసపాటిపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం సచివాలయం సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి వివరించారు. ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పూసపాటిపాలెం జగనన్న కాలనీకి వెళ్లే దారిలో వంతెన మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇళ్లులేని నిరుపేదలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విప్లవాత్మకమైన పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దేశం మొత్తం గుర్తించే విధంగా రాష్ట్రంలో గ్రామ సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలే మంత్రంగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్తామని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత 98 శాతం వరకు అమలు చేశామని తెలిపారు. కులం, మతం, రాజకీయాలకతీతంగా అర్హులందరికీ పథకాలు మంజూరు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, కోరాడ మహేష్, రౌతు శ్రీరామ్మూర్తిరాజు, రాజు, దేశెట్టి గణేష్, గుజ్జు సురేష్‌రెడ్డి, పడాల శ్రీధర్, టి.సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాలు తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు గోధుమపిండి ప్యాకెట్‌లు అందజేస్తున్న నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

- నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విజయనగరం: ప్రజావసరాలను తీర్చడమే ప్రభుత్వ ధ్యేయమని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. నగరంలోని 11వ డివిజన్‌లో రేషన్ కార్డుదారులకు బుధవారం గోధుమపిండి పంపిణీ చేశారు. ప్రతి కార్డుదారుడికి రెండు కిలోల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాలల్లో అమలు చేస్తూ ప్రజారంజక పాలన సాగిస్తున్నారని కొనియాడారు. కేవలం 16 రూపాయలకే కిలో గోధుమ పిండి అందించడం గొప్ప విషయమన్నారు. నగరంలో 89 రేషన్ షాపులకు గాను 59,052 కార్డుదారులు ఉన్నారని తెలిపారు. వీరందరికీ పంపిణీ చేసేందుకు 112.30 మెట్రిక్ టన్నుల పిండిని అధికారులు సిద్ధం చేశారన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శ్లోక పఠన పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న శ్యామ్‌సుందర్, తదితరులు

విజయనగరం టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ కల్యాణ మంటపం ఆవరణలో మాఘమాసం పురస్కరించుకుని బాలబాలికలకు బుధవారం శ్లోక కంఠస్థ పఠన పోటీలు నిర్వహించారు. పదేళ్ల నుంచి 15 ఏళ్ల లోపు బాలబాలికలకు విష్ణు సహస్ర నామ శ్లోకాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన ఎస్.ప్రవల్లిక, పి.మనస్విని, కె.వారిష్‌లకు నిర్వాహకులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో టీటీడీ ప్రొగ్రాం అసిస్టెంట్ జె.శ్యామ్‌సుందర్, ఆలయ అర్చకుడు పీవీ నరసింహాచార్యులు, న్యాయ నిర్ణేతలు కేవీ శ్రీనివాసచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాలమ్మ ఆలయ ప్రారంభోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

డెంకాడ: మండలంలోని కొండరాజుపేటలో నూతనంగా నిర్మించిన దుర్గలమ్మ ఆలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఆలయ ప్రారంభోత్సవం జరిగింది. సర్పంచ్ సరగడ కల్యాణి, సరగడ బంగారురెడ్డి ఆలయాన్ని నిర్మించారు. మధ్యాహ్నం భారీ అన్నసంతర్పణ చేపట్టగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి

- 'నెల్లిమర్లలో పోరు బావుటా' పుస్తకం ఆవిష్కరణ



అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఇఫ్టూ నాయకులు



నెల్లిమర్లలో పోరుబావుటా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు

నెల్లిమర్ల: నెల్లిమర్ల జూట్‌మిల్లు అమరవీరులకు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం ఘన నివాళులర్పించారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక అమరవీరుల స్మారక భవనంలో జరిగిన కార్యక్రమంలో ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు పి. ప్రసాద్, జాతీయ కమిటీ ప్రతినిధి వై. సాంబశివరావు, తదితరులు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 1994 పోలీసు కాల్పుల్లో అమరులైన నల్లి ముత్యాలనాయుడు, దువ్వారపు చిన్న, కాళ్ల అప్పల సత్యనారాయణ, కోల అచ్చప్పుడు, కల్లూరి రాంబాబు త్యాగనిరతి వెలకట్టలేనిదన్నారు. అమరుల ఆశయ సాధనకు కార్మికులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. హక్కుల సాధనకు పోరాటమే శరణ్యమన్నారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ రూపొందించిన 'నెల్లిమర్లలో పోరు బావుటా' పుస్తకాన్ని సాంబశివరావు, ప్రసాద్ ఆవిష్కరించారు. పుస్తకంలో పొందుపరిచిన విషయాలను కార్మికులకు వివరించారు. కార్యక్రమంలో ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా నాయకుడు పి. మల్లిక్, పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మి, న్యూ డెమక్రసీ నాయకుడు వై. కొండయ్య, పి. పద్మ, అరుణోదయ కళాకారులు పాల్గొన్నారు.

పక్కాగా హద్దుల గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు

విజయనగరం: నగరంలో చేపడుతున్న రీసర్వే ఆధారంగా సచివాలయాల పరిధిలో ఆస్తుల సరిహద్దులను పక్కాగా గుర్తించాలని మున్సిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు అన్నారు. బుధవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రణాళిక, అడ్మిన్ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు - భూరక్ష పథకం అమలులో భాగంగా రీసర్వే చేపడుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ప్రణాళికా కార్యదర్శులతో పాటు అడ్మిన్ కార్యదర్శులు కూడా టీమ్‌గా ఏర్పాడి సచివాలయ పరిధిలో ఉన్న ఆస్తుల సరిహద్దులను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. దీని వల్ల ఖాళీ స్థలాల వివరాలు, నిర్మాణ భవనాలు, ప్రభుత్వ స్థలాలు తెలుస్తాయన్నారు. సమావేశంలో ఏసీపీ అమ్మాజీరావు, టౌన్ సర్వేయర్ సింహాచలం పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ



శిక్షణ అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ రామారెడ్డితో అతిథులు, అధ్యాపకులు

డెంకాడ: జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలలో బ్రిటిష్ కౌన్సిల్, కళాశాల ఇంగ్లిష్ లాంగ్వేజ్ కమ్యూనికేషన్స్ స్కిల్ ల్యాబ్ సంయుక్తంగా ఇంగ్లిష్ లాంగ్వేజ్ లెర్నింగ్ అండ్ టీచింగ్‌పై ఫ్యాకల్టీకి నిర్వహిస్తున్న శిక్షణ బుధవారంతో ముగిసింది. యూకే నుంచి బ్రిటిష్ కౌన్సిల్ ఇంగ్లిష్ స్కోర్ సీనియర్ అసిస్టెంట్ మేనేజర్ బెన్ కుక్ ఆన్‌లైన్ ఈవెంట్‌లో పాల్గొని ప్రసంగించారు. బ్రిటిష్ కౌన్సిల్ స్కోర్ మేనేజర్ సచిన్‌కుమార్ ఇంగ్లిష్ యాప్, భాషాభివృద్ధిపై అవగాహన కల్పించారు. ప్రొగ్రాం కో ఆర్డినేటర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తమ్మినేని హరిబాబు పలు అంశాలపై మాట్లాడారు. శిక్షణలో ఆన్‌లైన్‌లో 38 మంది, ఆఫ్‌లైన్‌లో 229 మంది వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, విభాగాధిపతులు పరాంకుశం, ఎం.రాజన్‌బాబు, రామారావు, రాజేంద్ర, సుబ్బరామయ్య, సతీష్‌పూజారి, దుర్గాశైలజ, సతీష్, ప్లేస్‌మెంట్ డీన్ ప్రకాష్‌బాబు, ఫెమినావింగ్ జానకి, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తుల మేలు కోసమే లేబర్ కోడ్‌ల మార్పు

- ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్

నెల్లిమర్ల: కార్పొరేట్ శక్తుల లాభాల కోసమే కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను మార్పు చేసిందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి. ప్రసాద్ అన్నారు. నెల్లిమర్ల పట్టణంలోని అమరవీరుల స్మారక భవనంలో బుధవారం నిర్వహించిన ఇఫ్టూ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడుతూ, కార్మికులంతా లేబర్ కోడ్‌ల మార్పును ప్రతిఘటించడం ద్వారా తిప్పికొట్టాలన్నారు. ఫిబ్రవరి 25, 26 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో నిర్వహించే ఇఫ్టూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఏప్రిల్ 16వ తేదీ నుంచి మూడు రోజుల పాటు తిరుపతిలో నిర్వహించే జాతీయ మహాసభలకు పెద్ద ఎత్తున కార్మికులు తరలిరావాలన్నారు. ఈ సందర్భంగా జాతీయ కమిటీ పిలుపు సందేశాన్ని కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వర్లు వివరించారు. అనంతరం పీఓడబ్ల్యూ, అరుణోదయ, దళిత విముక్తి, పీడీఎస్‌యూ నేతలు ప్రసంగించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ నూతన అధ్యక్షుడిగా రొంగళి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శిగా బి. గీత, ఉపాధ్యక్షుడిగా కాళ్ల అప్పలసూరి, కార్యదర్శిగా ఎస్. సూర్యనారాయణరాజును కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు.

సత్య కళాశాల విద్యార్థిని ప్రతిభ



పల్లవిని అభినందిస్తున్న సత్య కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు, తదితరులు

విజయనగరం టౌన్: జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక తోటపాలెం సత్య డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఫస్ట్ ఇయర్ విద్యార్థిని ఎస్. పల్లవి ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం కైవసం చేసుకుంది. ఈ మేరకు విద్యార్థినిని కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కేరళ కాలికట్‌లో జరిగిన అంతర్ యూనివర్సిటీ ఉమెన్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పల్లవి జాతీయస్థాయిలో ప్రథమ స్థానం సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి, సీతం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మూర్తి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మహేష్, కోచ్ చల్లా రాము, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతికతపై అవగాహన కలిగి ఉండాలి



ముఖ్య అతిథిని సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, తదితరులు

విజయనగరం అర్బన్: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విశ్లేషణా జ్ఞానం ఉన్నా సాంకేతికతపై అవగాహన పెంపొందించుకోవాలని హైపర్ వర్జ్ అకాడమీ వ్యవస్థాపకురాలు మేక గాయత్రి అన్నారు. బుధవారం స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కొత్త నైపుణ్యాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కొత్త పోకడలపై పట్టు లేకపోవడం వల్లే వెనకబడుతున్నారన్నారు. నైపుణ్యాభివృద్ధి, రాబోవు కాలంలో సాంకేతిక రంగంలో రాబోయే మార్పులు, ఇంటర్వ్యూలలో నెగ్గుకు రావడం ఎలా అనే అంశాలను వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని విజయానికి మెట్లుగా మలుచుకోవాలని సూచించారు. అనంతరం ముఖ్య అతిథిని సత్కరించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్స్ దామోదర్‌నాయుడు, వెంకటలక్ష్మి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ వేణుమాధవరావు, కంప్యూటర్స్ సైన్స్ విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

పూసపాటిరేగ:

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఎ.నరేష్ అన్నారు. బుధవారం స్థానిక జాతీయ రహదారిపై హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణాలతో బయటపడవచ్చన్నారు. కార్యక్రమంలో పలువురు వాహనచోదకులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: హెల్మెట్ ధరిస్తూ ద్విచక్ర వాహనాలతో ర్యాలీ

హెల్మెట్ ధరించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత

విజయనగరం క్రైమ్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం కనీస బాధ్యతని టూటౌన్ సీఐ సీహెచ్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక కొత్తపేట నీళ్ల ట్యాంక్ జంక్షన్ వద్ద హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బైక్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఈ విషయంలో కుటుంబ సభ్యులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల ఎందరో ప్రమాదాల్లో ప్రాణాపాయం నుంచి తప్పించుకోగలిగారని చెప్పారు. అనంతరం అశోక్‌నగర్, దాసన్నపేట రోడ్డు, రింగురోడ్డు మీదుగా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో టూటౌన్ పోలీసులు, ప్రజలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



విజయనగరం క్రైమ్: జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు పతకాలు



రాష్ట్రస్థాయి పోటీల్లో సాధించిన పతకాలతో జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు సత్తా చాటారు. గత నెల 29, 30, 31 తేదీల్లో అనకాపల్లిలో జరిగిన పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారుల బృందం 167 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ప్రథమస్థానం దక్కించుకుంది. అంతేకాకుండా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు 20 బంగారు పతకాలు, 12 రజిత పతకాలు, 14 కాంస్య పతకాలు సాధించినట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ చారి ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.